## పింఛన్ పైసలతోనే బతుకుతున్న బాంచెన్



నాకు ఇద్దరు బిడ్డలు. వాళ్లు చిన్నగున్నప్పుడే నా భర్త చనిపోయిండు. ఇద్దరు బిడ్డల పెండిళ్లు చేసిన. ఇల్లు కూడా లేదు. ఒక్కదాన్నే నెహ్రూనగర్‌ల కిరాయికి ఉంటున్న. చెవులు సక్కగ వినపడవు. మోకాళ్ల నొప్పులున్నయి. ఏం పనిచేద్దామన్నా చేతగాని నాకు కేసీఆర్ సార్ ఇత్తున్న రూ.రెండు వేల పింఛనుతోనే బతుకుతున్న. ఆ పైసలే రాకుంటే నా బతుకేమైతుండెనో. ఇప్పటి వరకు నేను బతుకున్ననంటే నా పెద్ద కొడుకు కేసీఆర్ ఉన్నడన్న ధైర్యంతోనే. ఇప్పుడున్న పింఛను పైసలను రూ.5 వేలకు పెంచుతనన్నడు. కొడుకులే లేని నాకు కేసీఆర్ అన్నంపెట్టే దేవుడు. ఆ దేవుడే మళ్లీ రావాలని కోరుకుంటున్న.

**-గుజ్జేటి పోచ్చవ్వ (సిరిసిల్ల )**





# ఆసరా పింఛన్ ₹5016



- వచ్చే ఏడాది నుంచి రూ.3016 పంపిణీ
- ఏటా రూ.500 చొప్పున నాలుగేళ్లలో రూ.5016లకు పెంపు
- దివ్యాంగులకు వచ్చే ఏడాది రూ.5016
- ఏటా రూ.300 చొప్పున నాలుగేళ్లలో రూ.6016లకు పెంపు
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పెన్షన్ల పెంపుపై హర్షం

కరీంనగర్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మాత్రమే పెన్షన్లు ఇచ్చేవారు. అది కూడా రూ. 200 మాత్రమే ఇచ్చే వారు. వృద్ధులైతే 65 దాటితే తప్ప పెన్షన్లు వచ్చేవి కావు. అంతే కాకుండా ఊరికి పది పదిహేను పెన్షన్లు దాటేవి కాదు. ఎవరైనా వృద్ధులు చనిపోతే తప్ప పెన్షన్ పెట్టుకోవడానికి అవకాశం వచ్చేది కాదు. ఇలాంటి పరిస్థితుల్లో 2014లో తెలంగాణ సాధించి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ వీరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఒకేసారి దివ్యాంగులకు రూ.1,500, మిగతా వర్గాలకు రూ.వెయ్యి చొప్పున అందించారు. అంతే కాకుండా, గతంలో ఇచ్చిన సాంఘిక భద్రతా పెన్షన్‌ను 'ఆసరా' పేరుతో అమలు చేశారు. వీరితో పాటు ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత, నేత కార్మికులు, హెచ్ఐవీ, పైలేరియా బాధితులను కూడా చేర్చారు. తాజాగా, కిడ్నీ బాదితులను కూడా చేర్చి అండగా నిలిచారు. అంతేకాకుండా, వృద్ధులకు 65 ఏండ్ల నుంచి 57 ఏండ్ల వయోపరిమితిని కూడా కుదించారు.



### కేసీఆర్‌పై అచంచల విశ్వాసం

సమాజం, కుటుంబంలో నిరాదరణకు గురైన వారందరికీ పెద్ద కొడుకులా నిలబడి ఆసరా పెన్షన్ ఇస్తున్న సీఎం కేసీఆర్ పట్ల వీరికి అచంచలమైన విశ్వాసం ఉంది. కేసీఆర్ వారి పట్ల దయార్ద్ర హృదయంతో వ్యవహరించకుంటే తమ బతుకులు మరోలా ఉండేవని చాలా మంది లబ్ధిదారులు చెబుతున్నారు. గత జూలైలో దివ్యాంగులకు రూ.4,016 పెంచారు. అప్పుడే మిగతా వర్గాలకు కూడా పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. అదే మాదిరిగా ఇప్పుడు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో రూ.5 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3 వేలు పెంచుతామని, ఏడాదికి రూ.500 చొప్పున ఐదేండ్లలో రూ.5 వేలు చేస్తామని వెల్లడించారు. దివ్యాంగులకు కూడా రూ.6 వేల వరకు పెంచుతామని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ తమ పార్టీ మ్యానిఫెస్టోలో స్పష్టం చేశారు.

### పెంచిన పింఛన్ దివ్యాంగులకు గొప్ప వరం



కేసీఆర్ ప్రభుత్వం నెలనెలా ₹4,016 ఫించన్ ఇవ్వడం దివ్యాంగులకు గొప్ప వరం. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రం ఏర్పడిన తర్వాత ₹1,500, రెండోసారి ₹3,016 ఇచ్చింది. కాగా దశాబ్ది ఉత్సవాల తర్వాత దివ్యాంగులకు పింఛన్‌ను రూ.4016దాకా పెంచారు. కన్నతండ్రి వలే కేసీఆర్ దివ్యాంగులను ఆదరిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు పింఛన్‌ను రూ.6000కు పెంచుతామనడం అభినందనీయం. ప్రభుత్వ ఉద్యోగుల జీతం లాగా దివ్యాంగులకు నెలనెల రావడం ఆనందంగా ఉంది. దేశంలో ఇలా ఎక్కడా లేదని, అలాంటిది తెలంగాణలో ఇక్కడి బిడ్డగా దివ్యాంగుడినైన నేను తీసుకుంటున్న పింఛనే నిదర్శనం. రాష్ట్రంలోని దివ్యాంగులు తమ నియోజకవర్గంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేను ఆదరించి, మళ్లీ గెలిపిస్తాం. బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని దివ్యాంగుల పక్షాన ప్రకటిస్తున్నా.

**- గంగాధర్, అంబారిపేట సర్పంచ్ (జగిత్యాల రూరల్ )**

### ఏ ముఖ్యమంత్రిగూడా గింత పింఛన్ ఇయ్యలె..



గతంలో ఉన్న ఏ ప్రభుత్వాలు గిట్ల ఫించన్లు ఇయ్యలేదు. ఎందరో ముఖ్యమంత్రులు అచ్చింద్రు. పోయింద్రు. గిట్ల పట్టిచ్చుకున్నోళ్లు ఎవ్వలు లేరు. సీఎం కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయినంకనే పింఛన్ డబ్బులు పెంచిండు. మా అసొంటి ముసలోల్ల గోస చూసిన సారు ఇప్పుడు ఏడాదికోసారి ఫించన్ పెంచుతానని చెప్పడం సంతోషంగా ఉన్నది. ఆయన వచ్చినంకనే పేదోళ్ల బతుకులు మారుతున్నయ్..మళ్లా సారే రావాలే. వచ్చే ఎన్నికలల్ల కారుగుర్తుకు ఓటేసి ఈ సర్కారునే తెచ్చుకుంటం.

**- కొప్పుల మొగిలయ్య. కిష్టంపేట (కాల్వశ్రీరాంపూర్)**

### ప్రభుత్వమే ఆదుకుంటున్నది..



నాకు పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన మల్లయ్యతో పెండ్లి జరిగింది. మాకు పిల్లలు కాలే. నా పెనిమిటి 20 ఏండ్ల క్రితం ఆరోగ్యంబాగాలేక కాలంజేసిండు. అక్కడేముండాలని మా తల్లిగారి ఊరు కొలనూర్‌కు వచ్చి బతుకుతున్న. ఇప్పుడు నాకు 70 ఏండ్లపైనే ఉంటయ్. మూడేండ్ల కిందటి దాకా కూలీనాలీ పనుల ఎళ్లి బతికేది. ఇప్పుడు సాతనైతలేదు. ఇల్లు కిరాయికి తీసుకుని ఉంటున్న. నన్ను సాదేటోళ్లు ఎవరు లేరు. కేసీఆర్ సార్ పింఛన్ రూ.2 వేలు అత్తనయ్. అండ్లనే ఇల్లు కిరాయి కట్టి తిండికి బతుకుతున్న. రూ.1కిలో బియ్యం ఇత్తర్రు. పాణం మంచిగ లేక పోతే సర్కార్ దవాఖానకు పోతన్న. దసరా పండగకు చీర అచ్చింది. ఇగ ఎం ఖర్చులు లేవు. సర్కార్ ఇచ్చే వాటితోనే బతుకు ఎల్లుతుంది. కేసీఆర్ సార్ దయ వల్లనే మంచిగ బతుకుతున్న. ఆ సారే మళ్లా రావాలె.

**-అట్ల రామక్క, ఒంటరి మహిళ, కొలనూర్ (ఓదెల)**

### ఎక్కడ చూసినా పెన్షన్లపైనే చర్చ

ఇప్పుడు ఎక్కడ చూసినా ఆసరా పెన్షన్ల పెంపుపైనే చర్చ జరుగుతోంది. గతంలో తమ కోసం ఏ ప్రభుత్వ కూడా ఈ విధంగా పెన్షన్లు ఇవ్వలేదని, కేసీఆర్ గతంలోనే మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని, సమాజంలో నిరాదరణకు గురవుతున్న వారిని ఎందరినో ఈ పథకంలో చేర్చి ఆదుకున్నారని చర్చించుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలో ఒకప్పుడు 30–40 వేల మంది మాత్రమే ఉన్న పెన్షన్ లబ్ధిదారులు ఇప్పుడు తాజా, గణాంకాల ప్రకారం 1,40,973 మందికి చేరుకున్నారు. వీరికి నెలకు రూ.30.78 కోట్లు లబ్ధి చేకూరుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వృద్ధులు 33805, దివ్యాంగులు 10165, వితంతువులు 24554, నేతకార్మికులు 3718, గీతకార్మికులు 2363, ఒంటరి మహిళలు 1837, బీడీ కార్మికులు 43399, పైలేరియా బాధితులు 1004, కిడ్నీ బాధితులు 67 మంది ఉండగా, వీరికి ప్రతి నెలా ప్రభుత్వం రూ.26.65 కోట్లు పంపిణీ చేస్తోంది. అంటే ఆసరా పెన్షన్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంలో ఇతర పార్టీలు ఇచ్చే హామీలను నమ్మబోమని, తమకు కేసీఆర్‌పైనే సంపూర్ణ విశ్వాసం ఉన్నదని ఆసరా పెన్షన్ల లబ్ధిదారులు స్పష్టం చేస్తున్నారు.



### పొట్ట గడవడానికి ఆసరా అయితున్నయ్

నేను ఊరూరు తిరిగి ఒగ్గుకథలు చెప్పుకునేది. పదేండ్ల కింద ఓ ఊరిలో ఒగ్గుకథ చెప్పి రాత్రి ఇంటికొస్తుంటే లారీ గుద్దింది. ప్రమాదంల కుడి కాలుకు బాగా దెబ్బతగిలింది. దవాఖానకు పోతే డాక్టర్లు సగం కాలు తీసేసింద్రు. మంచాన పడ్డ. కథలు చెప్పుడు బంద్‌పెట్టిన. ఒకటే కాలుతో ఏ పనీ చెయ్యలేక పోతున్న. నాడు తిండిగింజలకు గోసయ్యింది. ఇద్దరు కొడుకులున్నా వాళ్లు కూడా ఒగ్గు కళాకారులే. వాళ్ల పరిస్థితి ఏమీ బాగాలేదు. తెలంగాణ సర్కారు వచ్చినంక దివ్యాంగుల పింఛను రూ.3016లు ఇస్తంది. అవే పొట్ట గడవడానికి ఆసరా అయితున్నయ్. ఇప్పుడు మళ్లీ వస్తే పింఛను రూ.6 వేలు చేత్తనంటున్నండు. సారే మాలాంటోళ్లకు దేవుడు. ఆయన వత్తె మా బతుకులకు భరోసా ఉంటదన్న ఆశతో ఉన్నం. మాలాంటోళ్ల బతుకులు మారాలంటే సారే మళ్లీ రావాలె.

**-గొర్రె ఎల్లయ్య, నేరెళ్ల గ్రామం, తంగళ్లపల్లి మండలం**





కరీంనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



# 'సద్దుల'కు వేళాయె..

**నేడే పెద్ద బతుకమ్మ**

- ఊరూరా ఆడిపాడనున్న ఆడబిడ్డలు
- పూలవనం కానున్న పల్లెలు, పట్టణాలు
- వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు
- నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, బారికేడ్లు
- వీధుల్లో విద్యుత్ వెలుగులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21: బతుకమ్మ సంబురం ఈనెల 14న మొదలైంది. అప్పటి నుంచి ప్రతి రోజూ ఆడబిడ్డల ఆటపాటలతో వీధి వీధీ హోరెత్తుత్తున్నది. ఆదివారం జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకోనున్నారు. ఇప్పటికే చాలాచోట్ల పూలను తెచ్చి ఇళ్లలో భద్రపరిచారు. ఉదయం నుంచే బతుకమ్మలను పేర్చి, సాయంత్రం కూడళ్ల వద్ద ఆడిపాడి, జలవనరుల్లో నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత వాయినాలు ఇచ్చిపుచ్చుకొని సత్తుపిండి పంచుకుంటూ బతుకమ్మ పాటలు నెమరేసుకుంటూ ఇళ్లకు చేరుకుంటారు.



కరీంనగర్ కూరగాయల మార్కెట్‌కు గునుగు తీసుకొస్తున్న మహిళ



కరీంనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళ



నగరంలోని భాగ్యనగర్‌లో వేసిన ముగ్గులు

### రద్దీగా మార్కెట్లు..

సద్దుల సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లన్నీ రద్దీగా మారాయి. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాకేంద్రాలతోపాటు గోదావరిఖని, మెట్‌పల్లి, హుజూరాబాద్, జమ్మికుంటలో కిటకిటలాడాయి. ఉదయం నుంచే అటు అమ్మకందారులు, ఇటు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్డు, టవర్ సర్కిల్, తెలంగాణ చౌరస్తా రోడ్లన్నీ కిటకిటలాడాయి. గోదావరిఖనిలో ప్రధాన చౌరస్తా ప్రాంతం పూల జాతరను తలపించింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి పూలను తీసుకువచ్చి విక్రయించగా, కొనుగోలు చేసేందుకు వచ్చిన నగరవాసులతో కళకళలాడింది.



కార్పొరేషన్ : కరీంనగరంలోని చింతకుంట వద్ద ఏర్పాట్లు

### పూర్తయిన ఏర్పాట్లు..

సద్దుల పండుగ కోసం అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా చోట్ల పిచ్చిమొక్కలను తొలగించి, బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా స్థలాలను చదును చేశారు. చెరువులు, కుంటల వద్ద లైటింగ్‌తోపాటు బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జన కేంద్రాలకు వెళ్లే వీధుల వెంట కూడా లైటింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. అన్ని విధాలా సేవలందించేందుకు వీలుగా బల్దియాల సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా ఈ సారి చెరువులు, కుంటల వద్ద నీరు సమృద్ధిగా ఉండడంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతున్నారు. మరోవైపు అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులతో జోరుగా పనులు కొనసాగిస్తున్నారు.



కరీంనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు